క్లుప్తంగా

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో పేరెంట్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలసి పాఠశాలలో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా విద్యాసంస్థ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ పాల్గొన్నారు. గ్రాండ్ పేరెంట్స్, కుటుంబ వ్యవస్థలపై విద్యార్థులకు బోధించారు. తాతామనుమలను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రాండ్ పేరెంట్స్‌కు నిర్వహించిన పలు ఆటల పోటీలలో తమ మనవళ్లతో పోటీపడుతూ వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు విద్యాసంస్థ చైర్మన్ బహుమతులను అందజేశారు. స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ హెబ్సా ప్రసాద్, రమేష్, సరళాదేవి, కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ తిరుమలయ్య వీధికి చెందిన కోనా రూపవతి, దానవీరసూరకర్ణ భార్యభర్తలు. వీరికి వివాహమై 6 సంవత్సరాలు అవుతోంది. వివాహ సమయంలో రూ.4 లక్షలు కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. అయితే కొంత కాలంగా భర్తతో పాటు అత్త తారామణి, ఆడపడుచు ఓంకారి వాశిక దేవి, బావ త్రివిక్రమన్ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధితులకు నష్ట పరిహారం అందించాలి: సీపీఎం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా కారణంగా ముగ్గురు మృతిచెందగా.. 500 మందికి పైగా హాస్పటల్ పాలయ్యారని.. డయేరియా కారణాలను ప్రభుత్వం వెంటనే నిర్ధారించి.. దీనికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. డయేరియాతో శుక్రవారం మృతిచెందిన నరసింహ కుటుంబాన్ని, న్యూఆర్ఆర్‌పేటలోని డయేరియా బాధితులను సీపీఎం నాయకులతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ చుట్టపు చూపుగా మంత్రులు వచ్చి వెళ్తున్నారు తప్ప ప్రజలకు ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాలు అందించడం లేదని ఆరోపించారు. మంత్రి నారాయణ, జాయింట్ కలెక్టర్‌లతో మాట్లాడి డయేరియా కారణాలను వివరించారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

తల్లి, చెల్లి కనిపించడం లేదంటూ ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): మూడు రోజులుగా ఇద్దరు మహిళలు కనిపించడం లేదని నున్న పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌నగర్ వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు రామకృష్ణ తన చెల్లిని కాపురానికి పంపడం లేదని తల్లిని మందలించాడు. అదే రోజు ఈ నెల 10న మధ్యాహ్నం ఆస్పత్రికి వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన తల్లి, చెల్లి తిరిగి రాలేదు. ఇప్పటి వరకు వారి కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

22 నుంచి దసరా ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీ ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తామని పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు తెల్లవారుజాము 4 గంటలకు అమ్మవారికి విశేషంగా అభిషేకం, అలంకరణ జరుగుతాయన్నారు. అమ్మవారు రోజుకొక అలంకారంలో పూజలు అందుకుంటారని చెప్పారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు జరుగుతాయని వివరించారు.

రోడ్లన్నీ గుంతలు.. ప్రజల కళ్లకు గంతలు

- ఏ రోడ్డు చూసినా అదే పరిస్థితి
- నరకప్రాయంగా మారిన ప్రయాణం
- కూటమి ప్రభుత్వ తీరుపై వాహన చోదకుల ఆగ్రహం
- మళ్లీ సంక్రాంతి వస్తున్నా కార్యాచరణ శూన్యం



గొల్లపూడి బైపాస్ రహదారిలో రోడ్డు దుస్థితి



ఊర్మిళానగర్ నుంచి కబేళా సెంటర్‌కు వెళ్లే రోడ్ల దుస్థితి



రోడ్డు మరమ్మతులు చేయాలంటూ బైపాస్ రహదారిపై ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)

భవానీపురం(విజయవాడపశ్చిమ): అధికారంలోకి వస్తే రోడ్లపై గుంతలు లేకుండా చేస్తామని ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ..హామీగానే మిగిలిపోతోంది. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లుగా మారుస్తామన్న చంద్రబాబు మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. మరో నాలుగు నెలల్లో మళ్లీ సంక్రాంతి వస్తున్నా రోడ్ల దుస్థితి మారలేదు. ఏ రోడ్డు చూసినా అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారుల్లోని భారీ గుంతలతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరో వారం రోజుల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుంది. విజయవాడ నగరానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తిరిగి తమ స్వస్థలాలకు చేరుకునే వారు గుంతల రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం నరకప్రాయం

గొల్లపూడి బైపాస్ రహదారిలో మైలురాయి సెంటర్ నుంచి హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ వరకు ఉన్న కొద్దిపాటి దూరంలో అడుగుకో గుంత దర్శనమిస్తోంది. ఆ గుంతలను తప్పించుకునేందుకు కారు, ఆటో, ద్విచక్రవాహనం వంటి చిన్నవాహనాలు రోడ్డుకు అనుసంధానంగా వేసిన పేవర్ బ్లాక్స్ (ఫుట్ పాత్)మీదుగా ప్రయాణిస్తున్నాయి, లారీలు, ట్రాలీలు వంటి భారీ వాహనాలు ఆ గుంతల మీదుగానే వెళుతుండటంతో అవి మరింత పెద్దవి అవుతున్నాయి. వర్షం వచ్చినప్పుడు ఆ గుంతల్లో నీళ్లు నిలిచి ఉండటంతో భారీ వాహనాలు ప్రయాణిస్తున్నప్పుడు పక్క నుంచి వెళ్లే ద్విచక్ర వాహనదారులపై చిందుతుండటంతో దుస్తులు ఖరాబవుతున్నాయి. ఇటీవలే ఈ రహదారిలో గుంతలు పూడ్చాలని కొందరు మహిళలు రోడ్డు మధ్యలో కూర్చుని ధర్నా చేశారు. దాంతో అక్కడక్కడ కంకరతోకూడిన వెట్‌మిక్స్‌తో మరమ్మతులు చేసినప్పటికీ రెండు మూడు రోజులకే మళ్లీ గుంతలు యథావిధిగా దర్శనమిస్తున్నాయి. మొత్తం మీద బైపాస్ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా ఉంది.

ఊర్మిళానగర్– కబేళా రోడ్డులో..

హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ నగరంలోకి వచ్చే లారీలు, భారీ వాహనాలు బైపాస్ రహదారి మీదుగా అట్కిన్‌సన్ స్కూల్ రోడ్‌లోకి వెళ్లాలి. అక్కడ నుంచి ఊర్మిళానగర్ మీదుగా కబేళా సెంటర్‌కు వెళ్లే రోడ్డులో ప్రయాణం చేసే వాహనదారులకు చుక్కలు కనబడుతున్నాయి. గుంతల్లో ప్రయాణంతో ఇటు ఒళ్లు అటు బళ్లు గుల్లగుల్లయి పోవాల్సిందేనని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గుంతల రోడ్లల్లో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా బోల్తా పడక తప్పదని ఆటో, కార్లు, లారీల డ్రైవర్లు వాపోతున్నారు. ఇందుకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. సంక్రాంతి పండుగకు రోడ్డుపై గుంతలు లేకుండా చూసే బాధ్యత తీసుకుంటానని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ ఇంకా ఎన్ని సంక్రాంతులు రావాలని మండిపడుతున్నారు.

నవలా సాహిత్యంలో యద్దనపూడిది స్వర్ణయుగం



విజయవాడ కల్చరల్: నవలా సాహిత్యంలో యద్దనపూడి సులోచనారాణిది స్వర్ణయుగమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. బొమ్మిడాల బ్రదర్స్ సహకారంతో సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో విఖ్యాత కాలమిస్ట్ నాగసూరి వేణుగోపాల్ సంపాదకత్వంలో యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన పరిచయ కార్యక్రమం విజయవాడ బుక్ ఫెస్టివల్ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ సులోచనా రాణి ప్రవేశంతో నవలా సాహిత్యం రూపురేఖలు మారిపోయాయన్నారు. తెలుగు పాఠకులు ఆమె నవలలకు బ్రహ్మరథం పట్టారని చెప్పారు. సులోచనా రాణి సాహిత్య వివేచన రచయిత నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ సులోచనా రాణి నవలలు రాయడమే కాకుండా తెలుగు సినిమాలకు కథలను అందించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. విమర్శలను సైతం ఆమె స్వీకరించేవారన్నారు. కవి బండ్ల మాధవరావు సభను సమన్వయం చేశారు. రచయిత్రి మందరపు హైమావతి సులోచనా రాణి నవలా సాహిత్యం అంశంగా మాట్లాడారు. సాహితీ ప్రచురణకర్త లక్ష్మి, పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య రక్షణలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు
- డయేరియా బాధితులకు పరామర్శ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజల ఆరోగ్యం కాపాడడంలో, ప్రాణనష్టం జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా బాధితులను నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ ఇసరపు దేవీతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి కేసుల తీరును అడిగి తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. అనంతరం విష్ణు మీడియాతో మాట్లాడుతూ న్యూ ఆర్ఆర్‌పేటలో డయేరియా విపత్తు వచ్చి నాలుగు రోజులు గడిచినా నేటికి దానికి కారణాలు ఏమిటో ఈ ప్రభుత్వం చెప్పకపోవడం దారుణమన్నారు. తమ తప్పిదాలను కప్పి పుచ్చుకునేందుకు ప్రభుత్వం, అధికారులు కలిసి తప్పుడు సంకేతాలు ప్రజలకు ఇస్తున్నారని చెప్పారు. నరసింహ అనే వ్యక్తి కుటుంబం గత వారం రోజులుగా డయేరియా సమస్యలతో బాధపడుతున్నారని, వారందరూ హాస్పటల్ చుట్టూ తిరుగుతుండగా నరసింహ కూడా మూడు రోజుల నుంచి డయేరియాతో ఇంట్లోనే బాధపడుతుంటే అతన్ని గుర్తించి చికిత్స అందించాల్సిన ప్రభుత్వం ఆయన నిండు ప్రాణాలను బలికొందని మండిపడ్డారు. నరసింహకు మెడికల్ క్యాంపులోనే చికిత్స అందించి ఉంటే బతికేవాడని, ఆయన్ను ఇక్కడ ఉంచకుండా ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించడం వల్ల సకాలంలో వైద్యం అందక దారిలోనే చనిపోయాడని చెప్పారు. దీనిని కూడా ప్రభుత్వం కప్పిపుచ్చుకునేందుకు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, 300లకు పైగా కేసులు ఉన్న డయేరియా ప్రాంతంలో డోర్ టు డోర్ సర్వే ఇంకా ఎందుకు పూర్తి చేయలేకపోయారని నిలదీశారు. మాటికో మంత్రి వస్తే డయేరియా బాధితులకు ఏ ప్రయోజనం ఉండదని, వాస్తవాలను వెళ్లడించి వారి కుటుంబాలను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ నిజనిర్ధారణ కమిటీ రాక

డయేరియా బాధితులకు అండగా నిలబడేందుకు వైఎస్సార్ సీపీ చర్యలు తీసుకుంటోందని మల్లాది విష్ణు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావు, డాక్టర్ సుధీర్, భార్గవరెడ్డి తదితరులతో కూడిన నిజనిర్ధారణ కమిటీ ఆదివారం డయేరియా ప్రాంతాల్లో పర్యటించి బాధితులను, ప్రజలను పరామర్శిస్తారని చెప్పారు. వాస్తవాలను తెలుసుకున్న తరువాత పార్టీ కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. డయేరియాతో చనిపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ల్యాబ్ రిపోర్టు రాలేదా, రానివ్వడం లేదా: మేయర్.

డయేరియాకు కారణాలేంటో 48 గంటల్లో ల్యాబ్ రిపోర్ట్ వచ్చాక చెబుతామని చెప్పి నాలుగు రోజులైనా ప్రభుత్వం ఇప్పటి వరకూ ఆ రిపోర్ట్‌ను ఎందుకు బయట పెట్టలేదని, అసలు ల్యాబ్ రిపోర్ట్ రాలేదా, రానివ్వలేదా అని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. డయేరియాతో నరసింహ అనే వ్యక్తి మృతిచెందగా మద్యం సేవించి చనిపోయాడని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డయేరియా ప్రాంతంలో బడ్డీ కొట్లతో సహా అన్ని మూసేసినప్పుడు మరి బార్‌లు ఎందుకు మూయలేదని నిలదీశారు. నరసింహ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఇసరపు రాజు, పఠాన్ నజీర్‌ఖాన్, ఆదినారాయణ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలయ నిర్మాణ ప్రతిపాదనకు మద్దతు తెలపాలి

అంబేడ్కర్ ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవిప్రకాష్



మాట్లాడుతున్న ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవిప్రకాష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలయ నిర్మాణం చేపట్టాలని 2వ డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మల కుమారి కౌన్సిల్‌లో ప్రతిపాదన చేయడంపై ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు రవిప్రకాష్ హర్షం వ్యక్తంచేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్ తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశారని చెప్పారు. ముఖ్యంగా సమాజంలో సమాన హక్కులు, స్వేచ్ఛ, విద్యా అవకాశాలు కల్పించడంలో ఆయన పోషించిన పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. అంబేడ్కర్ కృషి వల్లే సమాజంలో వెనుకబడిన వర్గాలు, ముఖ్యంగా మహిళలు సమాన హక్కులు పొందగలిగారని చెప్పారు. అందుకే ఆయనను ప్రజలు దేవునిలా ఆరాధిస్తున్నారన్నారు. ఈ నెల 16న జరుగనున్న కౌన్సిల్ సమావేశంలో ఆలయ నిర్మాణ ప్రతిపాదనకు ప్రజాప్రతినిధులు, అధికారులు సంపూర్ణ మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమాజం మొత్తం కలిసికట్టుగా ముందుకు వచ్చి అంబేడ్కర్ ఆలయ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సుమమాల సేవా సంస్థ అధ్యక్షుడు జాన్ రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు గుండె సుందర్‌పాల్, రాష్ట్ర యాదవ మహాసభ జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్, అంబటి వెంకటేశ్వరరావు, కొసనం కోటేశ్వరరావు, మస్తాన్, అలంకార్ బాబు, శ్రీను శేఖర్‌బాబు, పండు, సతీష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన కల్పించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



మైకు ద్వారా ప్రచారం చేస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వ్యాప్తి చెందిన అతిసార నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం వివిధ శాఖాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజలందరికీ అతిసార నివారణపై అవగాహన కల్పించాలని, ఇంటింటికి వెళ్లి కడుపు నొప్పి, విరేచనాలు, వాంతులు, నీరసం ఉంటే నిర్లక్ష్యం చేయకూడదని, దగ్గరలోని ప్రథమ చికిత్సా కేంద్రంలో సంప్రదించేలా వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. అతిసార నివారణకు శుభ్రమైన కాచి చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని, నీరు నిల్వ ఉండకూడదని, వాడుకునే మంచినీటికి మూతలు తప్పనిసరిగా పెట్టాలని, ఇంటి పైనున్న ట్యాంకును క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకు శుభ్రం చేసుకోవాలని, ట్యాంకుపై తప్పనిసరిగా మూతను ఉంచాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇంట్లో ఉంచుకోవాలని, పసి పిల్లలు ఉంటే వారికి తల్లిపాలను కొనసాగించవచ్చని చెప్పారు. కలుషిత నీరు, బయట వండిన అశుభ్ర ఆహారం తినకూడదని, విరేచనాలు వచ్చినప్పుడు కాఫీ, టీ, పానీయాలు తాగకూడదని, మలమూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాల్లో చేయకూడదని చెప్పారు. నగర పౌరులకు దీనిపై ఎలాంటి సందేహాలు ఉన్నా సమాచారం, సహాయం కోసం ఎన్టీఆర్ జిల్లా కంట్రోల్ రూమ్ సెల్: 91549 70454 నంబరును సంప్రదించాలన్నారు. ఈ మేరకు వీఎంసీ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అతిసార నివారణపై అవగాహన కల్పించే కరపత్రాలు అందించి, మైకు ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలి

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా వికాసానికి కృషి చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. సమైక్య భారతి, ఆంధ్రప్రదేశ్ తెలుగు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం భాషా సదుస్సు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. జాతీయ సమన్వయకర్త పి. కన్నయ్య మాట్లాడారు. బోడి ఆంజనేయరాజు, కె. డేవిడ్ రాజు, స్వాతి, శ్యాంప్రసాద్ తదితరులు చిత్ర గీతాలను ఆలపించారు.

ఆలయాల ఆస్తులు కాపాడుకుందాం

శివస్వామి, ఆత్మానంద భారతి స్వామీజీలు



మాట్లాడుతున్న శివస్వామి, పక్కన ఆత్మానంద భారతి స్వామీజీ, హజరత్తయ్యగుప్తా తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని తాళ్లాయిపాలెం శ్రీశైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి, ఆత్మానంద భారతి స్వామీజీలు పిలుపు ఇచ్చారు. విజయవాడ రూరల్ గొల్లపూడిలోని పద్మావతి కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం వివిధ పీఠాధిపతుల నిర్దేశకత్వంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్మ సమ్మేళనంలో రాష్ట్రంలోని పీఠాలు, ఆశ్రమాలు, అన్న సత్రాల సంరక్షణ, స్వామీజీలు, హిందూ సంఘాలు, హిందూ కార్యకర్తలపై అక్రమకేసులు, వేధింపులపై న్యాయవాదుల సలహాలు, సూచనలు స్వీకరించనున్నట్లు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. న్యాయవాదులు తప్పకుండా నల్లకోటు ధరించి రావాలని సూచించారు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా, హిందూ ధర్మ సమ్మేళన కార్యక్రమ నిర్వాహకులు కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. తొలుత వారు హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు.

ధర్మం తోడుగా ఉంటే న్యాయమార్గంలో నడుస్తారు

స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహరాజ్



కుంకుమ పూజలో పాల్గొన్న సువాసినులు



అభిభాషణ చేస్తున్న స్వామి అభిషేక్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ధర్మం తోడుగా ఉన్నవారు న్యాయ మార్గంలో న డు స్తారని స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహ రాజ్ అన్నారు. జాతీ య ప్రగతి, ప్రపంచ శాంతి, పేదల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఎ న్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ గుంటుపల్లి లోని సీపీ కన్వెన్షన్ సెంటర్‌లో స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ విద్యా దశ కోటి కుంకుమార్చన మహాయజ్ఞం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శనివారం మాతా లలితాదేవి పూజతో ప్రారంభమైంది. మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీలలితా సహస్రనామాన్ని జపిస్తూ సింధూరంతో అర్చన చేశారు. మూడు రోజులపాటు తలపెట్టిన ఈ మహాయజ్ఞంలో ఐదు వేల మంది సుహాసిని మహిళలతో పది కోట్ల సార్లు లలితా సహస్రనామ పారాయణ లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు. స్వామి అభిషేక్ బ్రహ్మచారిజీ మహరాజ్ అభిభాషణ చేస్తూ సనాతన ధర్మమే దేశానికి బలమన్నారు. భారత్ విశ్వ గురువుగా ఎదగాలని మాతా లలితాదేవిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. యువ చేతన జాతీయ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ తాము భారత దేశ సంక్షేమం, సనాతన ధర్మం కోసం అంకిత భావంతో పని చేస్తున్నామని తెలిపారు. ధర్మ పతాకంతో జాతి నిర్మాణానికి మహాయజ్ఞం చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, డాక్టర్ అనంత లక్ష్మి, శారద, భాను, రాజ్‌మల్ జైన్, రోహిత్ చౌదరి పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ ముత్యాలంపాడులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు గుండె, కంటి, ఎముకలు, కీళ్ల సమస్యలకు సంబంధించి 200మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మాజీ కార్పొరేటర్ పిన్నం రాజు త్రిమూర్తి రాజు, నవనీతం సాంబశివరావు, డి. మురళీకృష్ణంరాజు, బెజ్జం సురేష్ పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

పల్లపు ప్రాంతాలు జలమయం



విజయవాడ నగరంలో కురుస్తున్న వర్షం



ఆటోనగర్ మహానాడు రోడ్డులో నిలిచిన వర్షం నీరు

పటమట(విజయవాడ తూర్పు): నగరంలో శనివారం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ట్రాఫిక్ జాం అయి వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. శివారు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నీరంతా రోడ్లపైకి చేరి నగర వాసులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. ప్రధానంగా వన్‌టౌన్, అజిత్‌సింగ్ నగర్, భవానీపురం, పాయకాపురం, రాజీవ్ నగర్ కండ్రిక, వాంబే కాలనీ, పటమట, గుణదల, ఆర్టీసీ కాలనీ, న్యూ పోస్టల్ కాలనీ, దర్శిపేటలో రోడ్లపైకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీఎంసీ మాన్సూన్ క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో రోడ్లపైకి చేరిన నీటిని తోడేసినప్పటికీ కరెన్సీ నగర్, మహానాడు రోడ్డు, హెచ్‌టీ లైన్ రోడ్డు, ఎంజీ రోడ్డు, బెంజి సర్కిల్, పిన్నమనేని పాలి క్లినిక్ రోడ్డు, మొగల్రాజపురం, గుణదల ఈఎస్ఐ ప్రాంతాల్లో నీరంతా రోడ్లపైకి చేరుకుని రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలిగింది. రోడ్లపైకి వర్షం నీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) నీరు చేరుకోవడంతో పలు వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి.

అక్కరకు రాని స్టార్మ్‌వాటర్ డ్రెయిన్

నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుకూలంగా రోడ్ల వెంబడి నిర్మించిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు ఇప్పుడు అక్కరకు రావడం లేదు. 2014–19 టీడీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదలైన రూ. 440 కోట్లతో విజయవాడ నగరంలోని 64 డివిజన్లలో మేజర్, మైనర్, అవుట్‌ఫాల్ డ్రెయిన్లు సక్రమంగా నిర్మించకపోవటంతో ఇప్పుడు నగర వాసులు కొద్దిపాటి వర్షానికే తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. యూజీడీ పైపులైన్లు కూడా వర్షం నీటిలో కలవడంతో నగరంలోని 120 కాలనీలకు పైగా వర్షం నీటిలో నానుతున్నాయి. నగరంలో, శివారు ప్రాంతాల్లో నిర్మించిన అవుట్ ఫాల్ డ్రెయిన్లకు సరైన లెవలింగ్ లేకపోవడంతో నీరు ముందుకు కదిలే స్థితిలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో నీరు నిలిచింది.